



టేకుల్‌కోడ్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ మండలంలో భూకంపం!

● భయంతో ఇళ్లలో నుంచి పరుగులు తీసిన ప్రజలు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 20: కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్, ధర్మాపూరం, లక్ష్మీపల్లి, టేకుల్‌కోడ్ గ్రామాల్లో సోమవారం రాత్రి భూకంపం వచ్చింది. భూమి కదిలినట్లు గ్రహించిన ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. సోమవారం రాత్రి ఆయా గ్రామాల్లో 2 గంటల 55 నిమిషాలకు, మరోసారి 2గంటల 57 నిమిషాలకు భూకంపం సంభవించినట్లు ప్రజలు తెలిపారు. దీంతో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ మంగళవారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి రాత్రి వచ్చిన భూకంపం గురించి అడిగి తెలుసుకున్నారు.

సరిచేశారు..





'క్రీడా ప్రాంగణాన్ని పట్టించుకోరా?' అంటూ ఈనెల 18న ఆంధ్రజ్యోతి దిన పత్రిక జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు స్పందించారు. ఈ విషయమై ఎంపీవో రమేష్‌ను ఆరా తీసి బోర్డు, ఫిల్లర్లను పైకెత్తించేలా చర్యలు చేపట్టారు. దీంతో మంగళవారం కాశీంపూర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఏంఎన్ఆర్ ఈజీఎస్ ఈసీ నర్సింహరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శ్యామప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ మాలే శేఖర్‌తో కలిసి క్రీడా ప్రాంగణానికి చేరుకుని కూలిపోయిన క్రీడా ప్రాంగణం స్వాగత బోర్డును పరిశీంచారు. ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి గుంతలు తీయించి ఇనుప ఫిల్లర్లను పైకిలేపి బోర్డును సరిచేశారు. ఇది చూసిన పలువురు ఏన్నాళ్లకు అధికారులు స్పందించారంటూ చర్చించుకోవడం గమనార్హం.

- బషీరాబాద్, ఫిబ్రవరి 20



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్

కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.140కోట్లు

● శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, ఫిబ్రవరి 20: కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ. 140 కోట్లు మంజూరు కానున్నాయని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్‌కు చెందిన దాత బస్వలింగం బసవేశ్వర విగ్రహం ఏర్పాటు చేయగా, మహ్మదాబాద్‌కు చెందిన సీ.అశోక్‌కుమార్ వీరభద్రేశ్వర మహాద్వారాలను నిర్మించారు. వీటిని మంగళవారం సీత్పకర్ ప్రారంభించి మాట్లాడారు. రెండు మండలాల పరిధిలోని పదివేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం 6వేల ఎకరాలకు నీరందుతున్నారు. చెప్పారు. పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు ప్రాజెక్టును ఆధునికీకరించేందుకు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. త్వరలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. నాగసమందర్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుపై బ్రిడ్జి నిర్మిస్తామని, దోర్నాల అసంపూర్తి వంతెనను పూర్తి చేయిస్తానని, ధారూరుకు జూనియర్ కళాశాల మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండునెలల్లో వికారాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.500 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు 12వ శతాబ్దంలోనే బసవేశ్వరుడు కృషిచేశారని ఆయన గుర్తు చేశారు. మహనీయుల విగ్రహాలు పెట్టి వాళ్ల గురించి మాట్లాడటం కాకుండ వారిని ఆదర్శంగా తీసుకుని అనుసరించి చూపాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీలు రంజిత్‌రెడ్డి, బి.బి.పాటిల్, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆలంపల్లి కెంపీమఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ డాక్టర్ చెన్నబసవ ప్రభుస్వాములు, బీసీ కమీషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, వీరశైవ సమాజ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో జననాలను నమోదు చేయాలి

పరిగి, ఫిబ్రవరి 20: ప్రైవేట్ ఆస్పత్రుల్లో జననాలను కచ్చితంగా నమోదు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్ అన్నారు. పరిగిలోని విజేత ఆస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వసతులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిజేరియన్ ప్రసవాలు అత్యవసరమైతే తప్ప ప్రోత్సహించరాదని సూచించారు. జిల్లా పరిధిలోని అన్ని అస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు రోగి వివరాలను కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయిబాబా, వి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా విజేత ఆస్పత్రిలో రోగులకు సరైన వసతులు లేవని గుర్తించినట్లు సమాచారం. రోగుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేస్తూ, పేదలను దోపిడీ చేస్తున్నారని కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

సై! లోక్‌సభ పోరుకు రంగం సిద్ధం!

● పూర్తయిన ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్
● తుది దశకు చేరిన అధికారుల బదిలీల ప్రక్రియ
● ఎన్నికల సన్నాహాల్లో జిల్లా యంత్రాంగం



ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పరిశీలిస్తున్న సిబ్బంది

లోక్‌సభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు వేగవంతం చేసింది. త్వరలోనే ప్రకటన వెలువడనున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశాన్ని స్వయంగా పరిశీలిస్తూ పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లాలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు.

వికారాబాద్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలు మే నెలాఖరులోగా పూర్తి చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోనూ అందుకు తగినట్లుగా ఎన్నికల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాల ఆధారంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మరింత పకడ్బందీగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించే దిశగా జిల్లా యంత్రాగం చర్యలు చేపట్టింది. ఈనెల 8వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్నికల నిర్వహణలో ఎంతో ముఖ్యమైన ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ (ఫస్ట్ లెవల్ చెక్- ఎఫ్ఎల్‌సీ) పూర్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి ఈవీఎంల పనితీరు సక్రమంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఎన్నికల్లో ఉపయోగించేందుకు వీలుగా ఈవీఎంలను పటిష్టమైన భద్రత మధ్య గోదాంలో భద్రపరిచారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు.

భారీగా అధికారుల బదిలీలు...

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు బదిలీలు అనివార్యంగా మారిన విషయం తెలిసిందే. జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, డీపీవో, జడ్పీ డిప్యూటీ సీఈవో, డీపీఆర్‌వో, డీడబ్ల్యువో, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులను సంబంధిత శాఖల ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

కుటుంబమంతా ఒకే పోలింగ్ కేంద్రంలో...

ఒక కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే లోక్‌సభ ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచే విషయాన్ని ఎన్నికల విభాగం పరిశీలిస్తోంది. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలు, నవాబ్‌పేట మండలం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుండగా, కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, కొడంగల్, దుద్యాల మండలాలు మహబూబ్‌నగర్ నియోజకవర్గం పరిధిలోకి రానున్నాయి. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తే ఓటింగ్ శాతం పెరుగుతుందని భావించి కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.

ఓటింగ్ శాతం పెరిగేలా...

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలపైన అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు చేపట్టారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆటా పాటల ద్వారా అవగాహన కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు వీలుగా వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఎలక్ట్రోరల్ లిట్రసీ క్లబ్‌ల ద్వారా, సోషల్ మీడియా ద్వారా కళాశాలల్లోని యువ ఓటర్లకు అవగాహన కల్పించనున్నారు.

ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
పరిగి	2,66,532	305
వికారాబాద్	2,31,762	284
తాండూరు	2,43,905	269
కొడంగల్	2,42,432	275



ఈవీఎం గోదాంలో పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇంటి నుంచి కిలోమీటరు లోపే...

జిల్లాలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతోంది. అవసరమైన చోట అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఎక్కువ దూరం వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఓటర్ల ఇంటి నుంచి కిలోమీటరు దూరంలోపే పోలింగ్ కేంద్రం ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో 1500 మంది వరకు మాత్రమే ఓటర్లు ఉండనున్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో అంత కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోనున్నారు.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. వసతులు లేక ఓటర్లు ఇబ్బందులకు గురవకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వసతులు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. బీఎల్‌వోలు, మండల స్థాయి అధికారులతో సర్వే నిర్వహించి నివేదికలు తెప్పించుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, కరెంట్, ఫ్యాన్లు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌ల నిర్మాణం తదితర సదుపాయాలపై మరోసారి ఆరా తీస్తున్నారు. సౌకర్యాలు లేని చోట కల్పించేలా చర్యలు చేపట్టనున్నారు.

పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం?

లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,631 మందిఉండగా, వారిలో 4,86,109 మంది పురుషులు, 4,97,920 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు 39 మంది, ఎన్ఆర్ఐ 22, సర్వీసుఓటర్లు 541 మంది ఉన్నారు. చేవెళ్ల లోక్‌సభ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పరిగి నియోజకవర్గంలో 2,66,532 మంది ఓటర్లు ఉండగా, వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,762 మంది ఓటర్లు, తాండూరు నియోజకవర్గంలో 2,43,905 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి కొడంగల్ నియోజకవర్గంలో 2,42,432 మంది ఓటర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో 13,057 మది ఓటర్లు పెరిగారు. జిల్లాలో 1133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల చేపట్టిన ఓటర్ల నమోదు కార్యక్రమం ద్వారా పెరిగిన ఓటర్లకు అనుగుణంగా ఇది వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలు సరిపోనున్నట్లు ఎన్నికల విభాగం అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఏ పోలింగ్ కేంద్రంలో కూడా 1500 మందికి మించి ఓటర్లు నమోదు కాలేదు. కాగా, ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత కూడా అనుబంధ ఓటర్ల జాబితా ముద్రితమయ్యే వరకు కొనసాగనున్న ఓటర్ల నమోదు మేరకు అనుబంధ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అవసరమా ? లేక ఉన్న కేంద్రాలు సరిపోతాయా అనేది స్పష్టత రానుంది.

చేవెళ్ల లోక్‌సభ పీఠం బీజేపీదే

● ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పలా మార్చిన కేసీఆర్
● కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తుంది ?
● 17 స్థానాల్లోనూ బీజేపీని గెలిపించాలి
● బీజేపీ విజయసంకల్ప యాత్రలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

వికారాబాద్, ఫిబ్రవరి20: కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండిసంజయ్ అన్నారు.విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీచౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లించి మోదీ పేరులేకుండా వాడుకుని తెలంగాణను దోచుకుని అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నా బీఆర్ఎస్ ప్రశ్నించడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే విషయంలో కాంగ్రెస్ తెలంగాణ సమాజాన్ని మోసం చేసే ప్రయత్నంలో ఉందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగ, రైతాంగ, మహిళా, విద్యారంగ, జీవో 317 సమస్యలపై బీజేపీ ఉద్యమాలు, పోరాటాలు చేసి.. కేసీఆర్ మెడలు వంచి కేసులు పెట్టించుకుని జైళ్లకు వెళ్లింది బీజేపీ నాయకులైతే.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశారో అర్థం కావడం లేదన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే భారతదేశం విశ్వగురు స్థానానికి చేరుకుంటుందని, అన్ని రంగాల్లో బలోపేతం కానుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లోనూ ముందుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన అభివృద్ధి, సంక్షేమం విషయం తాము చూసుకుంటామని హామీ ఇచ్చారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ఇంత వరకు గల్లీ రాజకీయాలు జరిగితే, ఇప్పుడు ఢిల్లీ రాజకీయాలు జరగనున్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ మాట్లాడుతూ, నలుగురు ఎంపీలను గెలిపిస్తేనే రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్లు తీసుకువచ్చారని ఈసారి 17 స్థానాలు గెలిపిస్తే ఊహించని విధంగా రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. రాష్ట్రం బాగుండాలని కేంద్రం రూ. 9 లక్షల కోట్లు అప్పు తీసుకునేందుకు అనుమతులు ఇచ్చిందని, ఇంతకు ముందు అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడున్న పార్టీకి చిప్ప చేతిలో పెట్టి పోయిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయలేరన్నారు. కేసీఆర్‌ను జైల్లో వేస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు వారితోనే కుమ్మకయ్యారని మండిపడ్డారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అధ్యక్షతన జరిగి ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కార్యదర్శులు విజయ, సునీతారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, సదానందారెడ్డి, నాయకులు పాండుగౌడ్, సుచరిత, కేపీ రాజు, విజయభాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బుస్సా శ్రీకాంత్, సతీష్, వివేకానందారెడ్డి, విజయరాజ్, చరణ్ రెడ్డి, బస్వలింగం పాల్గొన్నారు.



ధారూరులో రోడ్‌షోలో పాల్గొన్న కార్యకర్తలు



సభలో మాట్లాడుతున్న బండిసంజయ్

ధారూరు బీజేపీ రోడ్‌షో

ధారూరు: బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా ధారూరులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్‌షోకు ఎంపీ బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల కోసం ప్రతి నిత్యం ఆలోచిస్తూ పని చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు ఇచ్చి మూడోసారి ప్రధానిని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇండియా కూటమి నుంచి నాయకులు బీజేపీలో చేరుతున్నారని ఆయనతెలిపారు. నాయకులు ఎం.రమేశ్, రవీందర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మరో ఛాన్స్!

● ఏప్రిల్ 1నాటికి ఓటరు నమోదుకు అవకాశం ● 18 ఏళ్లు నిండిన వారు అర్హులు

మేడ్చల్ ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంటు ఎన్నికలకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చేందుకు చూస్తున్నారు. యువతకు మరోసారి ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతం తగ్గిన నేపథ్యంలో ఈ సారి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. అర్హులైన యువతీ, యువకుల పేర్లు నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపునకు అవకాశం ఇచ్చారు. ఆన్‌లైన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత ఫారాలు పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంటుంది.

కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు

ల్లాలోని అన్ని కళాశాలల్లో స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉంటే వారి పేరును అక్కడే నమోదు చేయిస్తారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం గురించి వివరించనున్నారు. ఇటీవల రెండు పర్యాయాలు ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 8న తుది ఓటరు జాబితా



విడుదల చేశారు. జిల్లా ఓటర్లు 28,50,767మంది ఉన్నట్లు తేలింది. మరోసారి నమోదుకు అవకాశం ఇచ్చిన దృష్ట్యా యువత స్పందించాలి. తమ పేరు నమోదు చేసకోవాలని అధికారులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఓటరు నమోదు కోసం యువతకు ఇచ్చిన మరో అవకాశం సద్వినియోగం చేసుకునేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతాం. ప్రభుత్వ, ప్రైవేటు, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. యువత దీనిని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలి.

- విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

▸▸ నేడు గద్దెకు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ▸▸ నాలుగు రోజుల పాటు వనదేవతలకు పూజలు

వరంగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది.ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఎడ్లబండ్లు, కాలినడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం వస్తున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆది వాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్లతో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలు వైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజ లు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ము గ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయం లో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జ రుపుతారు. ఈ సమయంలోనే పూజారి సార య్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవ స్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడవునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

23న మొక్కులు

జాతర మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల, పగిడిద్ద రాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రింబవళ్లు మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.


సమ్మక్కగద్దె సారలమ్మగద్దె


వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు


మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

మహేశ్వరం మెట్లబావి పనులు త్వరగా పూర్తి చేయాలి


కోనేరు పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 20: మహేశ్వరంలోని కాకతీయుల కాలంనాటి కోనేరు(మెట్లబావి) పుణరుద్ధరణ పనులను త్వరగా పూర్తిచేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. రూ.90లక్షలతో చేపడుతున్న కోనేరు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనేరు పనుల్లో ఆలస్యం జరగకుండా చూడాలని, అందుకు ఎలాంటి సాయసహకారాలు కావాలన్నా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. చారిత్రక కోనేరు శిథిలావస్థలో ఉండగా గత ప్రభుత్వం ఆలయాల పునరుద్ధరణకు కోట్లాది నిధులు కేటాయించిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో రూ.10కోట్లకుపైగా వెచ్చించి పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామన్నారు. చారిత్రక శివగంగ రాజరాజేశ్వరాలయ అభివృద్ధికి కూడా నిధులు కేటాయించామని గుర్తుచేశారు. అలాగే తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతిని పురస్కరించుకొని మహేశ్వరం గేటు వద్ద ఉన్న యాదయ్య విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు కె.చంద్రయ్య, ఎం.నవీన్, మల్లేష్, అంబయ్య, నందం, రవినాయక్, రాజు, జె.లక్ష్మయ్య, సామేల్‌రాజు, సప్పిడి రాజు, సుమన్, రామకృష్ణ, డి.అశోక్, సమీర్, అదిల్ అలీ, కె.ప్రభాకర్, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో

వైభవంగా సమతా కుంభ్ ప్రారంభం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తులకు మంగళాశాసనాలు అందజేసిన చిన జీయర్‌స్వామి
- వచ్చే నెల 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి ముచ్చింతల్‌లో గల సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంభ్2024 ద్వితీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక గురువు త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అర్ధాభిషేకం ఘనంగా జరిగింది. సువర్ణమూర్తి భగవత్ రామానుజస్వామికి ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. అర్ధ అనేది రామానుజుల అవతార నక్షత్రం అని, ఈ క్షేత్రానికి అధిష్ఠాన దేవుడు శ్రీరామచంద్రుడని, ప్రతీ అర్ధ నక్షత్రం నుంచి చిత్త నక్షత్రం వరకు ఈ బ్రహోత్సవాలు నిర్వహిస్తామని చినజీయర్ స్వామి తెలిపారు. కాగా 108 దివ్య దేశాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అయోధ్య రాముడు మాత్రం పుర్వసు నక్షత్రంలో జన్మించాడన్నారు. తిరు నక్షత్ర ప్రయుక్త తిరుమంజనంతో శుభారంభం జరుగుతోందని ఆయన తెలిపారు. శ్రీ రామానుజుల వారికి అలంకరణ చేసి అష్టోత్తర శతనామ అర్చన జరిపించామన్నారు. మొదటి రోజు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. నగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల భక్తులు వేలాదిగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చివరగా భక్తులకు చిన జీయర్‌స్వామి మంగళా శాసనాలు అందజేశారు. మరో వారం పాటు జరిగే బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా స్వామిజీ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని స్వామిజీ తెలిపారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.


సువర్ణ భగవత్ రామానుజ స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


చిన జీయర్‌స్వామిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

ఆలయాల భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న అనిత

కడ్తాల్, ఫిబ్రవరి 20: ఆలయాల భూములను ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఆలయ భూముల పరిరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత హెచ్చరించారు. జిల్లాలో ఆలయ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కడ్తాల పంచాయతీ పరిధి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతంపై మంగళవారం సర్వే నిర్వహించారు. భూములను ఎండోమెంట్ ఈవోలు మోహన్‌రావు, స్నేహలత, దేవాదాయ తహసీల్దార్లు హారిక, విజయలక్ష్మి పరిశీలించారు. సర్వే నంబర్ 125,130లలో సర్వే చేసి ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులుతో కలిసి హద్దులు నిర్ధారించారు. సర్వే నంబర్ 120లో గల ఆలయ భూమి మరో రెండు రోజుల్లో సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 125లోని 9.13ఎకరాలు, 130లోని 2.20ఎకరాలకు హద్దులు పాతించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆలయ భూముల నుంచి కొందరు ఏర్పాటు చేసుకున్న రోడ్డును ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ టి.వేణుగోపాల్, నాయకులు వెంకటేశ్, గూడూరు సాయిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, బిక్యా, రాఘవేందర్ ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో రైతులు జాగ్రత్త

- ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు : షాబాద్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్

షాబాద్, ఫిబ్రవరి 20 : పంట పండించిన రైతులకు సైబర్ నేరగాళ్ల ముప్పు పొంచి ఉందని షాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ అన్నారు. వారిపట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో పడే పంట డబ్బులను ఓటీపీ ద్వారా మాయం చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బు ఉన్న విషయం తెలుసుకొని ఫోన్‌చేసి ఓటీపీ అడుగుతూ ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేస్తున్నారని తెలిపారు. 'మీకు వ్యవసాయ శాఖ లోన్ వచ్చిందని, గొర్రెలు, మేకలు, ఇతర పశువుల సబ్సిడీకి వివరాలు కావాలని, మీ సిమ్‌కార్డు బ్లాక్ అయిందని.. ఇలా వివిధ సాకులు చెబుతూ ఓటీపీ అడుగుతారని.. ఇలాంటి ఫోన్ కాల్స్‌ను ఎవరూ నమ్మొద్దని అధికారి చెప్పారు. బ్యాంకులే కాదు ఏ ప్రభుత్వ అధికారి, లేదా ప్రైవేట్ కంపెనీలైనా ఓటీపీ(వన్ టైమ్ పాస్‌వర్డ్) అడగవని పేర్కొన్నారు. ఒక వేళ అలా అడిగారంటే అది మోసం చేసేందుకే అని ప్రజలు ముఖ్యంగా రైతులు గుర్తుంచుకోవాలని తెలిపారు. ఓటీపీ అనేది సీక్రెట్ అని ఆ నంబర్‌ను ఎవరికీ చెప్పొద్దని తెలిపారు. మన ప్రయత్నం లేకుండా వచ్చే ఓటీపీలకు స్పందించకూడదని, ఇలాంటి నేరాలు ఎక్కువగా బ్యాంకుల సెలవు రోజుల్లో జరుగుతాయని తెలిపారు. ఒకవేళ ఫోన్‌కాల్స్‌తో మోసపోయిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఈ సందర్భగా ఆయన సూచించారు.


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

ఇన్‌స్పెక్టర్ సూచించిన అంశాలవీ...

- మీకు లాటరీ వచ్చింది. బహుమతి వచ్చింది. మీ బ్యాంకు అకౌంట్ డబ్బులు వేస్తామంటూ బ్యాంకు వివరాలు అడిగినప్పుడు చెప్పకూడదు.
- మెసేజ్‌లలో ఉండే నీలిరంగు లింక్‌లను క్లిక్ చేయవద్దు
- వివిధ వెబ్‌సైట్లు, సంస్థల నుంచి కస్టమర్ కేర్ వారు చెప్పినట్లు చేయవద్దు. నిజమైన కంపెనీలు ఇలా ఏవీ ఫోన్లో అడగవు.
- తక్కువ వడ్డీకి లోన్ ఇస్తామంటే నమ్మొద్దు. అలాంటి వాటికి ఎలాంటి చెల్లింపులు చేయవద్దు.
- బహుమతి వచ్చిందంటూ మెసేజ్ వస్తే నమ్మొద్దు. వారి చెప్పినట్టుగా ఎలాంటి చెల్లింపులు చేయవద్దు. ఇవన్నీ మోసమే!

నాటకీయ పరిణామాల మధ్య జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ అరెస్ట్

నందిగామ, ఫిబ్రవరి 20 : భూ లావాదేవీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని సోమవారం తెల్లవారుజామున నందిగామ పోలీసులు ఆయన స్వగ్రామం నందిగామ మండలం మొదళ్లగూడలో అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ఇదే గ్రామానికి చెందిన కొందరు ఇటీవల భూ వివాదాలపై సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మొదట సైబరాబాద్ కమిషనరేట్‌కు తరలించి అక్కడి నుంచి శంషాబాద్ డీసీపీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నవీన్‌రెడ్డిని షాద్‌నగర్ కోర్టులో హాజరుపరిచారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు న్యాయాధికారి ఆదేశాల మేరకు నవీన్‌రెడ్డిని షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోర్టు ఆవరణలో నవీన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనను ఏ కేసులో అరెస్ట్ చేశారో తెలియదని, గతంలో తనపై భూ వివాద కేసులు పెట్టినా ఆధారాల్లేవని ఏసీపీ పరిధిలోనే కేసును కొట్టేశారని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తనపై కక్షపూరితంగా కేసులు పెట్టించి అరెస్ట్ చేయించారని ఆరోపించారు. మంగళవారం రాత్రి 8గంటల వరకూ కోర్టులో బెయిల్‌పై తేలలేదు. నవీన్‌రెడ్డిని కోర్టులో హాజరుపర్చినట్టు తెలుసుకున్న మండలానికి చెందిన కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు, కేశంపేట ఎంపీపీ రవీందర్ అక్కడికి చేరుకొని నవీన్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు.

కార్యకర్త ఇంట్లో బండి సంజయ్ భోజనం



తాండూరులో బీజేపీ కార్యకర్త ఇంట్లో భోజనం చేస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

తాండూరు, ఫిబ్రవరి 20: బీజేపీ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం తాండూరుకు వచ్చిన ఎంపీ బండి సంజయ్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు రుద్రమ, తాండూరు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి ఇంట్లో భోజనం చేశారు.

అన్నివిధాలా వికారాబాద్ అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, ఫిబ్రవరి 20: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సారథ్యంలో వికారాబాద్ పట్టణం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. ధన్నారం రోడ్డులో గల హిందూ శ్మశానవాటికలో రూ.25లక్షల నిధులతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ పనులకు మంగళవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, స్థానిక కౌన్సిలర్ రాములు, మాజీ వైస్ చైర్మన్ రమేష్, నాయకులు లక్ష్మణ్, కృష్ణపంతులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన మంతన్‌గౌడ్

బషీరాబాద్, ఫిబ్రవరి 20: మండలంలోని మంతన్‌గౌడ్‌లో తాజా మాజీ సర్పంచ్ సత్యమ్మదేవేందర్‌రెడ్డి నివాసంలో మంగళవారం శివస్వాముల పడిపూజ భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా మెట్లపూజ, అభిషేకం, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం సాక్షిగణపతిపూజ, రుద్రభిషేకం, భ్రమరాంబ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు శివస్వాముల శివనామస్మరణ, భక్తి పాటలు, భజనలతో గ్రామం భక్తమయమైంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తనయుడు రోహిత్‌మహరాజ్, కాంగ్రెస్ నాయకులు సాయిల్‌గౌడ్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంగా యాడీబాపుగడ్

పెద్దేముల్, ఫిబ్రవరి 20: యాడీబాపుగడ్ రాబోవు రోజుల్లో పుణ్యక్షేత్రంగా వెలుగొందుతుందని పౌరాఘడ్ పీఠాధిపతి బాబుసింగ్‌మహరాజ్ అన్నారు. మండలంలోని కందనెల్లి తండా సమీపంలోని బంజారా ఆధ్యాత్మిక కేంద్రం యాడీ బాపుగడ్‌లో శ్రీసంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బంజారా ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించారు. జాగోబంజారా సమాజ్, యాడీబాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు రాథోడ్ రమావత్ సురేందర్‌మహారాజ్, రమావత్ శాంతిదేవి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక వేడుకలకు పౌరాఘడ్ పీఠాధిపతి బాబుసింగ్‌మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్, భవానీమాతల పూజల్లో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయాల వద్ద నైవేద్యం (భోగ్) సమర్పించారు.

ఉర్సే షరీఫ్ వేడుకలు షురూ..!

- హజ్రత్ శంషాఖాద్రీ దర్గాలో ప్రత్యేక పూజలు
- గంధం సమర్పించిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు, నాయకులు
- నేటి నుంచి ఉర్సు ప్రారంభం



శంషాఖాద్రీ దర్గాకు రథంపై గంధంతో వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు కుటుంబీకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 20: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉర్సే షరీఫ్ హజ్రత్ శంషాఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా మొదటి రోజు ప్రత్యేక రథంపై గంధాన్ని బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు కుటుంబీకులు దర్గాలో ముజవార్లు(పూజారులు) గంధం సమర్పించి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు ఉర్సు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. దర్గా కమిటీ అధ్యక్షుడు ఎండీ.మస్తాన్, ఉపాధ్యక్షుడు షేక్ మహిమూద్, మునీర్, తదితరులు దగ్గరుండి ఉర్సు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉర్సు ఉత్సవాల్లో స్థానికులతో పాటు వికారాబాద్ జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి నియోజక వర్గాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్ఐ రమేష్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణ రావు, సీనియర్ నేతలు డాక్టర్.పి.సంపత్‌కుమార్, ఎస్.వెంకటేష్ మహరాజ్, ఎం.రోహిత్ మహరాజ్, ఎమ్మెల్యే సోదరులు బి.శ్రీనివాస్‌రెడ్డి, బి.సత్యనారాయణ్‌రెడ్డి, ఎం.రాకేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, పవాన్‌ఠాగూర్, రాజన్న, సిద్దార్థ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ధ్రువతార సిరిపురం యాదయ్య



యాదయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రచయిత అందేశ్రీ, ఎంపీపీ

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20: యువకిషోరం యాదయ్య తెలంగాణ చరిత్రలో ధ్రువతారగా నిలిచి ఉంటారని ప్రముఖ రచయిత అందేశ్రీ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల పిట్టల శ్రీశైలం ఆర్గానిక్స్ వ్యవసాయ క్షేత్రంలో అమరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో యువకిషోరం సిరిపురం యాదయ్య త్యాగం మరువలేనిదన్నారు. సమస్త తెలంగాణ ప్రజల మనస్సులను యాదయ్య మరణం కదిలించిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేట్‌కు యాదయ్య పేరు పెట్టాలని పలువురు వ్యక్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, పద్మారావు, నాయకులు ధర్మారెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ, శంకర్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, దయాకర్‌రెడ్డి, మల్లయ్య, జీవన్‌రెడ్డి, గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలి



మాట్లాడుతున్న ఆర్డీవో విజయకుమారి

పరిగి, ఫిబ్రవరి 20: పరిగి మున్సిపల్ పరిధిలోని తుంకులగడ్డలోని 530 సర్వేనంబరులో భూముల వివరాలను సేకరించాలని వికారాబాద్ ఆర్డీవో విజయ కుమారి సూచించారు. పరిగి తహసీల్దార్ కార్యాయలంలో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 530 సర్వేనంబర్‌లో 370ఎకరాల భూమి ఉందని, అయితే ఇందులో ప్రభుత్వ సంస్థలకు ఎంత కేటాయించారో తేల్చాలని సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వగా, ఇంకా ఎంత భూమి ఉందో వివరాలు సేకరించాలని సూచించారు. మున్సిపాలిటీ నుంచి రెండు, రెవెన్యూ నుంచి నాలుగు బృందాలు ఏర్పడి ఇంటింటి సర్వే చేయాలని సూచించారు. ఈ సర్వేనంబరులో ఇక నుంచి ఇళ్ల నిర్మాణాలకు, విద్యుత్ కనెక్షన్‌లకు అనుమతులు ఇవ్వరాదని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, మల్లిఖార్జున్, విద్యుత్ ఏఈ ఖాజా పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20: పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఎంబీఏ హెచ్‌వోడీ విష్ణుచందన సూచించారు. మండలంలోని ఎంబీఏ విభాగానికి చెందిన 65మంది విద్యార్థులు ఇన్ఫోసిస్ సంస్థకు సందర్శన నిమిత్తం వెళ్లారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కల్పన, శరత్ పాల్గొన్నారు.



పారిశ్రామిక సందర్శనలో అనురాగ్ యూనివర్సిటీ ఎంబీఏ విద్యార్థులు

నాళాల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20: నాళాల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి సాంబశివరావు (డీఆర్డీఏ)తో కలిసి నిర్వహించిన సమీక్షాసమావేశంలో మాట్లాడారు. గ్రామంలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు, నాళాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నరని అన్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు చౌదరిగూడలో అనేక కాలనీలు నీటమునిగి ప్రజలు ఇబ్బందులు పడిన సందర్భాలు వెలుగు చూసినందున అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలన్నారు. చౌదరిగూడ పంచాయతీలో కాలనీలకు తాగునీరందించేందుకు వాటర్‌వర్క్స్ అధికారులు చేపట్టిన పనులు సంవత్సరాల తరబడి కొనసాగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రామారావు, ఏఈలు పరమేష్, కార్యదర్శి శశికుమార్, నాయకులు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

కామునిపల్లి నుంచి తిరుపతికి పాదయాత్ర



తిరుపతికి పాదయాత్రగా బయల్దేరిన భక్తులు

కులకచర్ల, ఫిబ్రవరి 20: కామునిపల్లి గ్రామానికి చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా మంగళవారం తిరుపతికి బయల్దేరారు. తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు కులకచర్లలో పలువురు స్వాగతం పలికారు. 15మంది గల సభ్యుల బృందం కామునిపల్లి గ్రామం నుంచి తిరుపతికి పాదయాత్రగా బయలుదేరారు. ప్రతీ సంవత్సరం గ్రామం నుంచి తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20: పట్టుదలతో ఏదైనా సాధ్యమవుతుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్న నలుగురు విద్యార్థినులు బెంగళూరు అజీజ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీటు సాధించారు. ప్రణతి, డి.ఐశ్వర్యలు అజీజ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలోని ఎంఏ ఎడ్యుకేషన్ విభాగంలో, ఎం.శిరీష, ఎస్. కౌశికలు ఎంఏ డెవలప్‌మెంట్ విభాగంలో సీట్లు సాధించారు. గతేడాది 24న పోటీ పరీక్ష నిర్వహించగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ సౌజన్య, అధ్యాపకులు, తోటి విద్యార్థినులు వారిని అభినందించారు.

సీఎం సభకు భారీగా తరలిరావాలి

పరిగి, ఫిబ్రవరి 20: కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో 21న బుధవారం జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు జిల్లా నుంచి భారీగా పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనను విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా కొడంగల్ నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు సీఎం కోస్గికి చేరుకుంటారని తెలిపారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనల తర్వాత, అక్కడ జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారని తెలిపారు. పరిగి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంగా రెండు గంటల వరకు పరిగికి చేరుకోవాలని సూచించారు. పరిగి నుంచి అంతా ర్యాలీగా కోస్గి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట:** పదోతరగతి విద్యార్థులకు దాసరి రవి ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను మంగళవారం అందజేశారు. తుర్కపల్లి మాజీ ఎంపీటీసీ దాసరి ముత్యాలు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దాసరి రవి ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు.

శామీర్‌పేట: శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడ్చల్‌లోని మునీరాబాద్, తూంకుంటలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కైరంకొండ నాగేంద్రబాబు, శివరంజని దంపతులు, వారి కుటుంబ సభ్యులు కైరంకొండ లక్ష్మీకాంత్, చందనాక్షరిలు అన్నదానం చేపట్టారు.

● **బొంరాస్‌పేట్:** దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవస్థానం నూతన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తున్నట్లు మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీ నూతన సభ్యులుగా ఈదుల జయరాం, బ్యాగరి నర్సింహులు, కొండాని మునికుమార్, కొత్తూర్ రాములు, వెంకటయ్య, కుమ్మరి యాదయ్య, ఈదుల నర్సింహులు, లక్ష్మిని నియమించారు.

● **కొడంగల్ రూరల్:** అర్చకుల వేతనాలు అందిస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమని దూప దీప నైవేద్య అర్చకుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి అన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు, అర్చక సంఘం సభ్యులతో జరిపిన చర్చల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

'అత్వెల్లి శివాలయ నిర్మాణ దాతలు ధర్మకర్తలు కాదు'

మేడ్చల్ టౌన్ ఫిబ్రవరి 20: మేడ్చల్ మున్సిపల్ అత్వెల్లిలో శివాలయ నిర్మాణ దాతలు ధర్మకర్తలు కాదని అత్వెల్లి వేంకటేశ్వర ఆలయం ధర్మకర్తలు నరహరిచారి, సుదర్శనచారి, రవికుమార్ చారిలు అన్నారు. ఈమేరకు వారు మంగళవారం మేడ్చల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయాన్ని నిర్మించే వారు ఆలయాల ధర్మకర్తలు కారని, అత్వెల్లి వెంకటేశ్వర ఆలయ ఆవరణలో శివాలయం ఉప ఆలయంగా ఉందని తెలిపారు. శివాలయాన్ని నిర్మించిన వారు ఆ ఆలయ ధర్మకర్తలుగా ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. అత్వెల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి తమ కుటుంబం అనువంశీక ధర్మకర్తలుగా వ్యవహరిస్తోందని తెలిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి శివాలయం ఉపాలయంగా ఉందని వివరించారు. ఆలయాన్ని నిర్మించినంత మాత్రాన ధర్మకర్తలు కారని, కేవలం నిర్మాణ దాతలు మాత్రమే అని అన్నారు. ఆలయ నిర్మాణ దాతలు తాము ధర్మకర్తలమనే ప్రచారం మానకపోతే దేవాదాయ చట్టం 30/87లోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనింగ్ పాలసీ అమలును పరిశీలిస్తాం



వినతిపత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్

తాండూరు, ఫిబ్రవరి 20: కర్ణాటక తరహాలో తాండూరు నాపరాయి సుద్దపై మైనింగ్ పాలసీ అమలు చేసేందుకు పరిశీలిస్తామని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ హామీ ఇచ్చారు. తాండూరు క్వారీ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి జుబేర్‌లాల, మాజీ అధ్యక్షుడు ఓంప్రకాష్ సోమాని తదితరులు మంగళవారం మైన్స్ డైరెక్టర్‌ను కలిశారు. పరిశ్రమలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కర్ణాటక తరహా పాలసీ అమలుపై దృష్టి పెడతామని తెలిపారు. తాండూరులో నాపరాతి వ్యాపారం సంక్షోభంపై ఇటీవల అసెంబ్లీలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఉద్రిక్తతల నడుమ కల్లు గీత కార్మిక సొసైటీ మార్పు

తాండూరు, ఫిబ్రవరి 20: తాండూరులో కల్లు గీత కార్మిక సొసైటీ మార్పు ఉద్రిక్తతల నడుమ ఏకగ్రీవమైంది. తాండూరు కల్లుగీత కార్మిక సొసైటీ నూతన అధ్యక్షుడిగా మేఘనాథ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్యామ్ సభ్యులుగా మహేందర్ గౌడ్, కిషోర్ కుమార్, వర్కల ప్రసాద్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం మారడంతో మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ చేతుల్లో అధికారం చేజారింది. డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ మర్చంట్ అధ్యక్షుడు వెంకట్ రాములు గౌడ్ వెళ్లడంతో కొత్తసంఘం ఎన్నుకున్నారు. ఐదేళ్లకోసారి నిర్వహించే సొసైటీ ఎన్నికకు తాడి కోపరేటివ్ అధికారి మహమ్మద్ ఆలీ ఎన్నికల నిర్వహణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఎన్నికలు నిర్వహించేందుకు మంగళవారం కల్లు డిపోకు రాగా మహమ్మద్ అలీచేరగా అప్పటి వరకు అధ్యక్షులుగా ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ అనుచరుడు హరిహరగౌడ్ వాగ్వాదానికి దిగాడు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదంటూ అధికారులను నిలదీశాడు. దీంతో ఎక్సైజ్, సివిల్ పోలీసులు అక్కడి చేరుకుని హరిహరగౌడ్‌ను తాండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొసైటీ ఎన్నికను కొనసాగించారు.

24న వేంకటేశ్వరస్వామి కల్యాణం

తాండూరురూరల్, ఫిబ్రవరి 20: ఈనెల 24వ తేదీన మండలంలోని అంతారం అనుబంధ దస్తగిరిపేట్ శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, అర్చకుడు వెంకటాచార్ శుక్రవార్, రాఘవాచార్ శుక్రవార్, పురంధరాచార్ శుక్రవార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 24న ఉదయం 10.30గంటలకు శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని చెప్పారు. అనంతరం స్వామివారి రథోత్సవం, సాయంత్రం అశ్వవాహన సేవ, ఉయ్యాల సేవ, మహా మంగళహారతి, స్వస్తి వచన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

వికారాబాద్, ఫిబ్రవరి 20: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన దాసు(35)ను గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద రాత్రి 8.30 ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దాసు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు మహవీర్ ఆసుపత్రిలో వంట మనిషిగా పనిచేస్తుండగా విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు 30 నెలల జైలు శిక్ష

మేడ్చల్ టౌన్ ఫిబ్రవరి 20: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు మేడ్చల్ న్యాయస్థానం 30నెలల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన సుచిన్‌రెడ్డి, నీరజరెడ్డిలకు 2017సంవత్సరంలో వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకున్నాయి. నీరజరెడ్డి భర్త వేధింపులు భరించలేక 2017 సంవత్సరం జూలై 3వ తేదీన ఆత్మహత్య చేసుకుంది. నీరజ తల్లిదండ్రులు తమ కూతురు మృతికి భర్త సుచిన్‌రెడ్డి కారణమని జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి రమేష్ నిందితుడికి 30నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 20: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సురయిపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త గొల్ల రాజప్ప మంగళవారం ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాజప్పకు పార్టీలో సభ్యత్వం ఉండటంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రొయ్యల బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, ఫిబ్రవరి 20: మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించనున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధి నాలుగో వార్డు ప్రగతి నగర్‌లో మంగళవారం రూ.7.80లక్షలు, గణేష్ నగర్‌లో రూ.6లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ లక్ష్మి, నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు వేణు, స్థానికులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న దిర్సంపల్లి గ్రామస్తులు

దోమ, ఫిబ్రవరి 20: మండలంలోని దిర్సంపల్లి గ్రామానికి నూతనంగా వచ్చిన ఎంపీడీవో మహేశ్‌బాబు దోమ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొండారెడ్డి, ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

దోమ, ఫిబ్రవరి 20: మండలంలోని మోత్కూర్‌లో సీసీరోడ్డు పనులను మంగళవారం ఎంఈవో హరిచందర్, కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు భాస్కర్, మల్లేశం, ఆనంద్, లింగయ్య, సర్దార్, చెన్నయ్య, రవికుమార్, ఖదీర్, రాఘవేందర్, చంద్రకాంత్, శంకర్, ఖైసర్, షబ్బీర్, శ్రీనివాస్, రాములు, దోమ నర్సింహులు, మొగులయ్య, ఇస్తయ్య, వెంకటయ్య, నరేశ్, మల్లేశం పాల్గొన్నారు.

పరిగి డీఎస్పీపై హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు



హెచ్‌ఆర్సీ కార్యాలయం ఎదుట నాయకులు

పరిగి, ఫిబ్రవరి 20: పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డిపై పలు సంఘాలు మంగళవారం నగరంలోని మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ఎం.వెంకటయ్య, గోవింద్‌నాయక్, రాథోడ్ శ్రీనివాస్, బస్సు చంద్రయ్య, అంజిరావణ్‌లు మాట్లాడుతూ.. సివిల్ తగాదాల్లో తలదూర్చి అర్హులకు అన్యాయం చేస్తున్న పరిగి డీఎస్పీ, దోమ ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో అయూబ్ అనే రైతుకు చెందిన భూమిని, ఇతరులతో కబ్జా చేసేందుకు కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు రైతు న్యాయం చేసి, పోలీసులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని తెలిపారు. హెచ్‌ఆర్సీలో వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు రఘురామ్, అయూబ్, అమీర్‌అలీలు ఉన్నారు.

క్రీడా ప్రాంగణానికి విద్యుత్ లైట్లు అందజేత

కులకచర్ల, ఫిబ్రవరి 20: బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ భూనెటి మండలంలోని ఇప్పయిపల్లి గ్రామ క్రీడా మైదానానికి విద్యుత్ లైట్లు అందించారు. గ్రామానికి చెందిన యువకులు స్థానిక క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ తదితర క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. క్రీడా ప్రాంగణంలో రాత్రి సమయంలో లైట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మారుతి కిరణ్ స్పందించారు. క్రీడా మైదానంలో విద్యుత్ లైట్ల ఏర్పాటు కోసం తన సొంత నిధులతో అందించారు. క్రీడాకారులకు అన్నీ విధాల సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.